క్లుప్తంగా

నివాళి



నివాళి అర్పించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

పోరుమామిళ్ల : మండలంలోని పెద్ద యరసాల గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి తిరుపాల్‌రెడ్డి మృతి చెందిన సమాచారంతో మంగళవారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి గ్రామం వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మృతుని కుమారుడు రమణారెడ్డికి సంతాపం తెలిపారు. ఆయన వెంట జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ సీఎం బాషా, సర్పంచ్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విచారణ చేపట్టాలి



వినతిపత్రం ఇస్తున్న నారాయణరెడ్డి

పోరుమామిళ్ల : రంగసముద్రం చెరువు ఆయకట్టు చైర్మెన్ చెరుకూరి వీర చెంద్రాయుడు భూ ఆక్రమణలపై సమగ్ర దర్యాప్తు చేసి చర్య తీసుకోవాలని కోరుతూ మంగళవారం వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చాపాటి లక్ష్మీనారాయణ రెడ్డి తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ బాధ్యతాయుతమైన పదవిలో ఉండి రైతులకు న్యాయం చేయాల్సింది పోయి పదవిని అడ్డం పెట్టుకొని భూ ఆక్రమణలు పాల్పడటం దౌర్భాగ్యమన్నారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపి ఆక్రమణదారుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను విజ్ఞప్తి చేశారు.

వీడ్కోలు సన్మానం



సచివాలయ ఉద్యోగులతో సర్పంచ్ రఘురామిరెడ్డి

పోరుమామిళ్ల : మండలంలోని పుల్లివీడు సచివాలయంలో పని చేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్ రమణ, హార్టికల్చర్ సునీల్, మహిళా పోలీస్ శ్యామల, సర్వేయర్ నాగమణి, ఏఎన్‌ఎం లక్ష్మీనరసమ్మ బదిలీ అయ్యారు. బదిలీ అయిన ఉద్యోగులను మంగళవారం సర్పంచ్ టి.రఘురామిరెడ్డి శాలువా, పూలదండలు, మెమెంటోలతో సన్మానించారు. ఇంతకాలం వారు అందించిన సేవలకు ధన్యవాదాలు తెలిపారు.

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి



అరటి పంటను పరిశీలిస్తున్న అధికారులు

కాశినాయన : రైతులు పంటలకు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని ఏఓ చంద్రమోహన్, ఏఈఓ రవి తెలిపారు. మంగళవారం మండలంలోని గంగనపల్లె, ఆకులనారాయణపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని సూచించారు. సహజంగా దొరికే ఆవుపేడ, ఆవు మూత్రం, పుట్ట మట్టి కలిపి పంటలకు చల్లుకోవాలని తెలిపారు. ఈ మూడింటిని నానబెట్టి పిచికారీ చేసుకోవచ్చన్నారు. సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, డీఏఏ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సాగు పద్ధతులపై సూచనలు

బి.కోడూరు : మండలంలోని పెద్దుళ్లపల్లె, పాయలకుంట్ల గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వరి, మొక్కజొన్న సాగులో సస్యరక్షణ, ఎరువుల వాడకం, యాజమాన్య పద్ధతులు, వరిలో కాలిబాటలు ప్రాముఖ్యత గురించి మండల వ్యవసాయాధికారిణి కౌశిక రైతులకు వివరించారు. వివిధ పథకాల గురించి అవగాహన కల్పించారు. ఖరీఫ్ 2025 పంటల బీమా కోసం రైతులు ప్రీమియం చెల్లించాలని, దిగుబడి ఆధారిత పంటలకు ఈ నెల 31వ తేదీలోపు, వరికి ఆగస్టు 15వ తేదీలోపు చెల్లించాలన్నారు.

మెలకువలు పాటించాలి

మైదుకూరు : పంటల సాగులో యాజమాన్య పద్ధతులను పాటించాలని మండల వ్యవసాయాధికారి బాలగంగాధర్ రెడ్డి, వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఫిరోజ్ హుస్సేన్ తెలిపారు. విశ్వనాథపురం, అక్కులాయపల్లె గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని తెలిపారు. బీమా ప్రీమియం చెల్లించాలని సూచించారు. రైతులకు 50 శాతం సబ్సిడీతో జిప్సం, జింక్ సల్ఫేట్‌ను, 80 శాతం సబ్సిడీతో డ్రోన్లను ఇస్తామన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

బ్రహ్మంగారిమఠం : మండల పరిధిలోని ఎద్దులాయపల్లె, చెంచయ్యగారిపల్లె, తోట్లపల్లె గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు మంగళవారం పోరుమామిళ్లకు చెందిన చిత్తా శౌరిరెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డా.గీత, తోమాస్ రెడ్డి చిత్తా ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఆ సంస్థ ప్రతినిధి ఎల్. ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. పేద పిల్లలకు సహాయం అందించాలనే కార్యక్రమం చేపట్టామన్నారు.

చంద్రబాబు మోసాలను ఎండగడదాం

మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

దువ్వూరు : కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ఎన్నికల హామీలను అమలు చేయకుండా సీఎం చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగడదామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం దువ్వూరులోని కానాల ఫంక్షన్ హాల్‌లో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీపై వైఎస్సార్‌సీపీ మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ టీడీపీ నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం పేరుతో ఇంటింటికి తిరగడం సిగ్గుచేటన్నారు. ప్రజలకు ఏమి చేశారని ప్రశ్నించారు. సుపరిపాలన అంటే చెప్పినవన్నీ చేసి పాలనను అందించాలి కానీ హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేయడం కాదన్నారు. మా ప్రభుత్వంలో కులం, మతం, ప్రాంతం, పార్టీ చూడకుండా రూ.కోట్ల సంక్షేమ పథకాలను వైఎస్ జగన్ ప్రజలకు అందించారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఏమిచ్చారో.. ఏ పథకాలు అమలు చేశారో దమ్ముంటే ప్రజలకు వివరించాలన్నారు. మా ప్రభుత్వంలో అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసారా పింఛన్లు, రైతు భరోసా, వైఎస్సార్ చేయూత, నేతన్న నేస్తం వంటి పథకాలు ఇచ్చి ప్రజలను ఆదుకున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయినా ఇంత వరకు రైతు భరోసా, మహిళలకు ఆడ బిడ్డ నిధి కింద నెలకు రూ.1500 పథకం, మహిళలకు ఉచిత బస్సు పథకాల ఊసే లేదన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలన్నారు. పార్టీ కార్యకర్తలకు, నాయకులకు అన్యాయం జరిగిన మాట వాస్తవమని, కార్యకర్తలకు, నాయకులకు జగన్ అధికారంలోకి రాగానే కచ్చితంగా న్యాయం చేస్తామన్నారు. టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై చేస్తున్న దాడులను అడ్డుకుంటామన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మరింత బలోపేతం చేసేందుకు గ్రామం, మండల స్థాయిలో కమిటీలను వేస్తున్నామన్నారు. జగన్ సభలకు వచ్చే జనాలను చూసి చంద్రబాబు, కూటమి ప్రభుత్వానికి భయం పట్టుకుందన్నారు. మండలంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల మీద కక్షసాధింపు చర్యలు చేపడుతున్నారని, అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రజల కోసం అధికారులు పని చేయాలి కానీ, అధికార పార్టీ నాయకుల కోసం అధికారులు పని చేసి ఇబ్బందులకు గురికావద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ మాజీ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి మాట్లాడుతూ ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలు గుర్తించారన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడికి వెళ్లినా లక్షలాది మంది జనాలు వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, జెడ్పీటీసీ మేరువ కృష్ణయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గోపిరెడ్డి బాబు, నాయకులు బొంతపల్లె వెంకటసుబ్బారెడ్డి, కోగటం వీరారెడ్డి, చిరాకి బాషా, వీపీ స్వామి, వ్యయసాయ మండలి జిల్లా కమిటీ మాజీ చైర్మన్ ఓబుళ కొండారెడ్డి, ఇరగంరెడ్డి పద్మనాభరెడ్డి, సానేపల్లి కిరణ్‌కుమార్‌రెడ్డి, వేమిరెడ్డి ఓబుళరెడ్డి, గుర్రాల రామమునిరెడ్డి, నగరి శ్రీకాంత్, జెర్రి హరికృష్ణ, కానాల విజయ, పి.రామకృష్ణయ్య, అతావుల్లా, అమీర్ బాషా, తుమ్మల మస్తాన్ రెడ్డి, చిన్న, జేష్టాది రవికుమార్, ఎం.శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును ఓడించేందుకు ప్రజలు సిద్ధం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

చాపాడు: త్వరలో అసెంబ్లీ నియోజకవర్గాలు పెరగనున్నాయి. రాష్ట్రంలో 175 నుంచి 225కు అసెంబ్లీ స్థానాలు పెరగనున్నాయి. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా 200 సీట్లతో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాబోతోంది‶ అంటూ మైదుకూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమ శిక్షణా కమిటీ చైర్మన్ శెట్టిపల్లె రఘురామిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. చాపాడు మండలంలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి సన్నిధిలో గల శ్రీ లక్ష్మీచెన్నకేశవ కళ్యాణ మండపంలో మంగళవారం ×బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ‶పై వైఎస్సార్‌సీపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎప్పుడు ఎన్నికలు జరిగినా 200 సీట్లతో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని..ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఎన్నికల కోసం సిద్ధమవ్వాలన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ ఏడాదిలోనే 95 శాతం హామీలు అమలు చేశారని, చాపాడు మండలంలోనే రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, రైతు భరోసా పథకాల ద్వారా రూ.59 కోట్లు రైతులకు అందిందని.. అమ్మ ఒడి, వైఎస్సార్‌సీపీ చేయూత, పింఛన్లు ఇలా అన్ని రకాలైన పథకాలను ప్రజలకు చేర్చారన్నారు. కేసీ కెనాల్ పరిధిలో రూ.29కోట్ల అభివృద్ధి చేశామన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఏడాది ముగిసినా ఎలాంటి పథకాలు ఇవ్వలేదన్నారు. 2014లో తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబును 2019లో ప్రజలు చిత్తుగా ఓడించి జగన్‌ను సీఎం చేశారని, మళ్లీ 2024లో రెట్టింపు అబద్ధాలు, మోసాలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబును ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేను వైఎస్సార్‌సీపీ నాయకులు శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, ఎంపీపీ లక్షుమయ్య, జెడ్పీటీసీ శాంతురాజు, మాజీ జెడ్పీటీసీ శాంతురాజు, సర్పంచ్ కిషోర్‌రెడ్డి, టీఓపల్లె రవిశంకర్‌రెడ్డి, కర్నాటి నారాయణరెడ్డి, మడూరు వినయ్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన నియోజకవర్గ అధ్యక్షులు చంద్రఓబుళరెడ్డి, క్రిస్టియన్ మైనార్టీ కన్వీనర్ బాబ్జీ, నాయకులు జయరామిరెడ్డి, సీపీ సుబ్బారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యం కలిగిన యువతతోనే అభివృద్ధి



నైపుణ్యాల పట్ల అవగాహన కల్పిస్తున్న ప్రధానోపాధ్యాయులు జి.వి.సుబ్బారెడ్డి

బద్వేలు అర్బన్ : నైపుణ్యం కలిగిన యువతతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని, ఇందుకోసం వారికి నైపుణ్యం కలిగించి వారి సామర్థ్యాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వి.సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవం సందర్భంగా మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చదువుతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా నేటి యువతకు బంగారు భవిష్యత్తు నిర్మించుకోవడానికి మెరుగైన అవకాశాలు ఉంటాయని అన్నారు. అనంతరం ఆయా వృత్తిశాఖల నిపుణులతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే వృత్తిశాఖల వారీగా క్విజ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆయా వృత్తిశాఖల నిపుణులు వాసుదేవరెడ్డి, సునీత్‌కుమార్, అక్షయ్‌కుమార్, ఉపాధ్యాయులు రామయ్య, సుధాకర్‌రెడ్డి, జకరయ్య, సి.రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి

బద్వేలు అర్బన్ : ఈ నెల 22 నుంచి24వ తేదీ వరకు బద్వేలులో జరగనున్న సీపీఐ జిల్లా 25వ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి కార్మిక వర్గాన్ని పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయం జేవీభవన్‌లో నిర్వహించిన ఏరియా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఉన్నటువంటి పెండింగ్ ప్రాజెక్టులు, పరిశ్రమలు వెంటనే పూర్తి చేయాలని, జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేయాలనే డిమాండ్లతో మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారని చెప్పారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్మికులందరిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.మస్తాన్, ఏరియా కార్యదర్శి పి.వి.రమణ, పట్టణ కార్యదర్శి నాగేష్, లారీ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగేంద్ర, మున్సిపల్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రొద్దుటూరు : స్థానిక మడూరు కాలువపై గోడ నిర్మించాలని ఎంపీజే రాయలసీమ ఇన్‌చార్జి ఎండీ అయూబ్ ఖాన్, జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఉమ్రి, పట్టణ అధ్యక్షుడు హుస్సేన్ బాషా కోరారు. స్థానిక మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డిని మంగళవారం వారు కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైదాగారి వీధి, సుధా థియేటర్ పక్కన మడూరు కాలువకు సైడ్‌వాల్ లేనందున ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. అధికారులు స్పందించి మడూరు కాలువకు సైడ్‌వాల్ నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇస్మాయిల్, ముక్తియార్, అల్లాబకాష్, ఫరన్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



డెంగ్యూ మాసోత్సవాలపై ర్యాలీలో వైద్యాధికారులు, విద్యార్థులు

గోపవరం : పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని బద్వేలు సబ్ యూనిట్ ఆఫీసర్ టి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు డెంగ్యూ మాసోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా మంగళవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గాంధీనగర్, అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల, మడకలవారిపల్లె సచివాలయం పరిధిలో స్థానిక వైద్య సిబ్బంది, విద్యార్థులచే జాతీయ కీటక జనిత వ్యాధులపై ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా లేనప్పుడే దోమల వృద్ధి అధికంగా ఉంటుందని, తద్వారా వాటిద్వారా వ్యాపించే వ్యాధులు ప్రమాదకరంగా ఉంటాయని చెప్పారు. దోమలు అభివృద్ధి అయ్యే ప్రాంతాల గురించి ప్రజలకు అవగాహన కల్పించి నివారణ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. దోమకాటు వలన మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, మెదడువాపు వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, ఇవి రాకుండా నివారించాలంటే ప్రజలందరి భాగస్వామ్యంతో దోమలను అదుపు చేయాల్సిన అవసరం ఉందన్నారు. వైద్యాధికారి డాక్టర్ మురళీకృష్ణ, ప్రిన్సిపల్ భానుమతి, ఏఎస్‌ఎం సరస్వతి, హెల్త్ అసిస్టెంటు వెంకటసుబ్బయ్య, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ తప్పనిసరి



మేకవారిపల్లెలో సిబ్బందిని సన్మానిస్తున్న నాయకులు



ప్రభలవీడు సచివాలయంలో..

బి.కోడూరు : ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వర్తించే ప్రతి ఉద్యోగికి బదిలీ తప్పనిసరి అని మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని మేకవారిపల్లె, ప్రభలవీడు సచివాలయాల్లో బదిలీపై వెళుతున్న ఉద్యోగులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మేకవారిపల్లె సచివాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ లక్ష్మీనరసారెడ్డి, ఉప సర్పంచ్ శివారెడ్డి, నాయకులు వెంకటసుబ్బయ్య, ప్రహల్లాదరెడ్డి, రమణారెడ్డి హాజరై సచివాలయ ఉద్యోగులను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి వారు చేసిన సేవలను కొనియాడారు. అలాగే ప్రభలవీడు గ్రామ సచివాలయంలో బదిలీపై వెళుతున్న ఉద్యోగులకు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి సర్పంచ్ జయరామిరెడ్డి, నాయకులు నాగిరెడ్డి హాజరై సచివాలయ ఉద్యోగులను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు

నేడు మండల పరిషత్ రెండో ఉప ఎంపీపీ ఎన్నిక

చాపాడు : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో బుధవారం మండల పరిషత్ రెండో ఉపఎంపీపీ ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వీర కిషోర్ తెలిపారు. మే 22 పల్లవోలు ఎంపీటీసీ, రెండో ఉప మండలాధ్యక్షురాలు నగర్తి సుందరమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఖాళీ అయిన ఉప ఎంపీపీ స్థానానికి తిరిగి ఎన్నిక నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ప్రత్యేక సమావేశంలో ఎంపీటీసీలు రెండో ఉప ఎంపీపీని ఎన్నుకోనున్నారని ఎంపీడీఓ చెప్పారు.

ఆగష్టు 15లోగా పీఎం ఫసల్ బీమా చేయించుకోవాలి

చాపాడు : ఆగష్టు 15వ తేది లోగా ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి దేవి పద్మలత పేర్కొన్నారు. మండలంలోని చియ్యపాడు, గుంతచీపాడు గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ.. పీఎం ఫసల్ బీమా యోజన పథకాన్ని ఎకరాకు రూ.84లు చెల్లించి నమోదు చేయించుకోవాలన్నారు. ఖరీఫ్ పంటల సాగుపై రైతులు మెళకువలు తప్పనిసరిగా పాటించాలని, డిమాండ్ మేరకూ యూరియా ఎరువులను తెప్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వీఏఏలు బేబి, రాము తదితరులు పాల్గొన్నారు.

ఆర్య వైశ్యులకు ఉపకార వేతనాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : పేద ఆర్య, వైశ్య విద్యార్థులు ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులు ఉపకార వేతనాలకు అర్హులని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 31వతేదీ వరకు సభ కార్యాలయంలో దరఖాస్తులు లభిస్తాయని తెలిపారు.

27న సర్వసభ్య సమావేశం

స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఈ నెల 27న ఉదయం 10.30 గంటలకు ఆర్యవైశ్య సభ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు తెలిపారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

బి.కోడూరు : మండలంలోని మూలవారిపల్లె, సిద్ధివారిపల్లె, వంకవారిపల్లె, శ్రీరామ్‌నగర్ గ్రామాల్లో మంగళవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కంభం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథ ప్రచారం నిర్వహించారు. భగవద్గీత జ్ఞానం ద్వారా సమాజంలో ఉన్న కులమతాల అసమానతలను తొలగించబడుతుందన్నారు.

అవగాహన పెంచుకోవాలి

చాపాడు: సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని మైదుకూరు జూనియర్ సివిల్ జడ్జి ఖాజీ మైనుద్దీన్ పేర్కొన్నారు. మండలంలోని అన్నవరం గ్రామంలో మంగళవారం సాయంత్రం నేషనల్ లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు, చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన జూనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ.. తల్లిదండ్రుల ఆస్తుల్లో కుమారులతో పాటు కూతుర్లకు కూడా సమాన హక్కు ఉంటుందన్నారు. భూ తగాదాలు, ఇంకా ఎలాంటి సమస్యలు ఎదురైనా లాయర్లను పెట్టుకోలేదని బాధితులు ప్రభుత్వ లాయర్‌ను సంప్రదించాలని, వారి ద్వారా కేసులను వాదింపజేసుకుని న్యాయం పొందవచ్చన్నారు. సమాజంలో ప్రతి అంశంపై చట్టం ఉంటుందని దీనికి లోబడి ప్రజలు నడుచుకోవాలని సూచించారు. చాలా ఎళ్ల తరబడి పరిష్కారం కేసులను లోక్ అదాలత్ ద్వారా రాజీ మార్గంలో వెళ్లి పరిష్కారం చేసుకోవచ్చని సూచించారు. తహసీల్దారు రమాకుమారి, జ్వాలా నరసింహశర్మ, శివరామకృష్ణ, జేకే చారి, వహాబ్, కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ వైస్ చైర్మన్ లోకేశ్వర్‌రెడ్డి, ఏఎస్‌ఐ బాషా, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గృహాలకు ఉచిత విద్యుత్

మైదుకూరు : ప్రధాన మంత్రి సూర్యగర్ పథకం కింద సోలార్ రూఫ్ టాప్‌తో గృహాలకు ఉచిత విద్యుత్ అందించనున్నట్లు విద్యుత్ శాఖ డైరెక్టర్ (టెక్నికల్) కె.గురవయ్య తెలిపారు. మంగళవారం ఆయన మైదుకూరు విద్యుత్ డివిజన్‌లోని 12 మండలాల అధికారులు, సిబ్బందితో సంస్థ ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ గురవయ్య మాట్లాడుతూ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు కోసం గృహ వినియోగదారులకు బ్యాంకులు అతి తక్కువ వడ్డీతో రుణాలు ఇస్తాయని తెలిపారు. ప్రభుత్వం రూ.98వేల వరకు సబ్సిడీ ఇస్తుందని చెప్పారు. విద్యుత్ చౌర్యంపై దాడులు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రజల సంతృప్తి స్థాయి 52 శాతమేనా..

విద్యుత్ సేవల పట్ల మైదుకూరు ప్రాంత ప్రజల సంతృప్తి స్థాయి కేవలం 52 శాతమే ఉందని విద్యుత్ శాఖ డైరెక్టర్ గురవయ్య వెల్లడించారు. ఇంత తక్కువగా ఎందుకు ఉందని సమీక్ష సమావేశంలో డివిజన్‌లోని అధికారులను ఆయన ప్రశ్నించారు. సమావేశంలోఎస్.రమణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు భరణికృష్ణ, మధుసూదన్, రమణారెడ్డి, ఏఈలు, జేఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ



చాపాడు పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ నాగరాజు

చాపాడు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా.నాగరాజు ఆకస్మిక తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని ఫార్మసీ డ్రగ్స్, ల్యాబ్‌ను పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందికి సంబంధించిన హాజరుపట్టిక, పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమావేశమైన ఆయన మాట్లాడుతూ.. పీఎన్‌సీ, ఏఎన్‌సీ లను ఎక్కువగా నమోదు చేయటంపై దృష్టి పెట్టాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వాటిని నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటింటి లార్వా సర్వే చేపట్టాలని, డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. షెడ్యూల్ ప్రకారం వ్యాక్సినేషన్ జరిగాలని సూచించారు. కార్యక్రమంలో ఎండమాలజిస్ట్ ఎస్.ఖాజామొహిద్దీన్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.మల్లేషు, వైద్యాధికారులు శివప్రసాద్‌రెడ్డి, శ్రీవాణి, పీహెచ్‌ఎన్ సుకన్య, సూపర్‌వైజర్లు బాబురెడ్డి, భాస్కర్‌యాదవ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేవీకే శాస్త్రవేత్తకు యంగ్ సైంటిస్ట్ అవార్డు



డాక్టర్ ఎస్.ఫిరోజ్ హుస్సేన్, శాస్త్రవేత్త

మైదుకూరు : మైదుకూరు మండలం వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రంలో ఉద్యాన విభాగం శాస్త్రవేత్తగా పని చేస్తున్న డాక్టర్ ఎస్.ఫిరోజ్ హుస్సేన్‌కు న్యూఢిల్లీకి చెందిన వ్యవసాయ రంగంలో ప్రతిష్టాత్మక 'అగ్రిమీట్ ఫౌండేషన్–భారత్' సంస్థ యంగ్ సైంటిస్ట్ అవార్డును ప్రకటించింది. ఉద్యాన పంటల సాగులో రైతులకు ఉత్తమ సేవలను అందించినందుకు సంస్థ తనకు ఈ అవార్డును అందిస్తున్నట్లు శాస్త్రవేత్త ఫిరోజ్ హుస్సేన్ తెలిపారు. ప్రొద్దుటూరుకు చెందిన డాక్టర్ ఫిరోజ్ హుస్సేన్ డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం అనంతరాజుపేట ఉద్యాన కళాశాల నుంచి 2013లో హార్టికల్చర్ (ఫ్రూట్ సైన్స్)లో ఎంఎస్‌సీ పూర్తి చేశారు. బెంగళూరు కేసరఘట్టలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చర్ రీసెర్చ్ కేంద్రంలో 2018లో ఫ్రూట్ సైన్స్‌లో పీహెచ్‌డీ చేశారు. అనంతరాజుపేట కళాశాలలో 2022 వరకు టీచింగ్ అసిసోయేట్‌గా పనిచేశారు. వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రంలో 2022 నుంచి ఉద్యాన విభాగం శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. అగ్రిమీట్ ఫౌండేషన్–భారత్ సంస్థ 2025 సంవత్సరానికి గాను గ్లోబల్ కాన్ఫరెన్స్ అవార్డుల పంపిణీలో తనకు యంగ్ సైంటిస్ట్ అవార్డును ప్రకటించినట్లు ఫిరోజ్ హుస్సేన్ వివరించారు.


ప్రతి ఒక్కరూ బీమా కలిగివుండాలి



పథకాలపై అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

అట్లూరు : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రామ స్థాయి జన సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని కామసముద్రం గ్రామంలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో సామాజిక భద్రత పథకాలైన పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై, ఏపీవై, పీఎంజేబీవై, ఇ–కేవైసీ, డిజిటల్ ఫ్రాడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీజీబీ బ్యాంకు మేనేజర్ దుశ్యంత్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఒక్కరు బీమా కలిగి ఉండాలన్నారు. బీమా ఉపయోగాలు, పెన్షన్, ఆన్‌లైన్ మోసాల గురించి తెలియజేశారు. బీమా లేనివారు బ్యాంకులో గాని ఆర్థిక అక్షరాస్యత కేంద్రంలో గాని బీమా చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్లు రాయుడు, సంతోష్, సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు సిద్దారెడ్డి, నాగలక్ష్మి, బీసీ హరికృష్ణ, వీఓఏ సుజాత, ఫీల్డ్ అసిస్టెంట్ గోపాలయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి



మాట్లాడుతున్న షేక్ సలీం

ప్రొద్దుటూరు : మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని పీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం, జిల్లా అధ్యక్షుడు షేక్ జాకీర్ ఉమ్రి, పట్టణఅధ్యక్షుడు హుస్సేన్ బాషా, జమా అతె ఇస్లామిక్ హింద్ సభ్యులు బీఎస్ షఫీవుల్లా, విరసం సభ్యురాలు పి.వరలక్ష్మి డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికుల సమ్మెకు వారు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మొండివైఖరి వీడి కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని తెలిపారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, ఆప్కాస్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

మైదుకూరు : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ అనుబంధ ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర సమితి పిలుపు మేరకు మైదుకూరు మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు మున్సిపల్ కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.శ్రీరాములు, నియోజకవర్గ కార్యదర్శి ఏవీ శివరామ్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్ మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు, ఆఫీస్ సిబ్బందికి, టౌన్ ప్లానింగ్ సిబ్బందికి జీఓ నంబర్ 36 ప్రకారం కేటగిరీల వారీగా రూ.21వేలు, రూ.24వేలు జీతం ఇవ్వాలని కోరారు. కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను, రిటైర్డ్ అయిన కార్మికుల గ్రాట్యూటీని వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.కార్యక్రమంలో సీపీఐ మైదుకూరు పట్టణ కార్యదర్శి డి.సుబ్బరాయుడు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు బి.వీరయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పి.వెంకటసుబ్బయ్య, బి.రాజారావు తదితరులు పాల్గొన్నారు.